



వనదేవతలకు మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

మేడారంలో భక్తజన సందోహం

జాతరకు ముందే కోలాహలం

- కిక్కిరిసిన వనదేవతల గద్దెలు
- తల్లులను సందర్శించుకున్న సుమారు 4 లక్షల మంది
- మొక్కులు చెల్లించుకున్న ప్రముఖులు

మేడారం, జనవరి 28 : తాడ్వాయి మండలంలోని వనదేవతల సన్నిధి మేడారం కిటకిటలాడింది. సమక్క, సారలమ్మలను దర్శించుకోవడానికి భక్తజనం భారీగా తరలివచ్చారు. మహాజాతర ఫిబ్రవరి 21 నుంచి జరగనుండగా ముందస్తుగానే తల్లులలకు మొక్కులు చెల్లించుకున్నారు. వారాంత సెలవు కావడంతో భక్తులు తండోపతండాలుగా తరలివచ్చారు. సుమారు 4 లక్షల మంది వనదేవతలను దర్శించుకున్నారని దేవాదాయ శాఖ ఈవో రాజేంద్రం తెలిపారు. మేడారం చేరుకున్న భక్తులు ముందుగా జంపన్నవాగులో పుణ్యస్నానాలు ఆచరించారు. కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించుకున్నారు. శివసత్తుల పూనకాలు, డోలువాయిద్యాల మధ్య సమ్మక్క, సారలమ్మ నామాన్ని జపిస్తూ క్యూలైన్ల ద్వారా తల్లుల గద్దెలకు చేరుకున్నారు. పసుపు, కుంకుమ, పూలు, పండ్లు, చీరెసారెలు, కొబ్బరికాయలు, నిలువెత్తు బంగారం (బెల్లం) సమర్పించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. కోరికలు తీర్చాలని అమ్మవార్లను వేడుకున్నారు. బలిమొక్కులు సమర్పించి, మేడారం పరిసరాల్లో చెట్ల కింద వంటలు చేసుకొని బంధుమిత్రులతో విందు భోజనాలు చేశారు.

తల్లులను దర్శించుకున్న ప్రముఖులు..

వనదేవతలను తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి రాజేశ్వర్‌రావు, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి, సీసీఎల్‌ఏ జాయింట్ సెక్రటరీ సవిత, యాదాద్రి అదనపు కలెక్టర్ శ్రీనివాస్, సీఎం పీఆర్‌వో శ్రీనివాస్, ఇరిగేషన్ ఎస్‌ఈ విజయభాస్కర్, గిరిజన సంక్షేమశాఖ ఇంజనీరింగ్ ఈఈ హేమలత దర్శించుకున్నారు. ప్రత్యేక పూజల అనంతరం తల్లుల ప్రసాదాలను పూజారులు వారికి అందజేశారు. కండువాలతో సత్కరించారు.



జంపన్నవాగులో బ్యాటరీ ఆఫ్ ట్యాప్స్ కింద స్నానాలు చేస్తున్న భక్తులు



గూడూరు అభయారణ్యంలో వన్యప్రాణులు

వన్యప్రాణుల రక్షణకు 'క్యాచ్ ద ట్రాప్'

- అడవుల్లో వలలు, ఉచ్చులను గుర్తిస్తున్న సిబ్బంది
- అనుమానిత వేటగాళ్ల ఇళ్లలో తనిఖీలు
- జిల్లా వ్యాప్తంగా 1.50 లక్షల ఎకరాల్లో అడవులు
- ఉద్యోగుల పనితీరు మెరుగుపర్చేందుకు 'వనసంరక్షణ యాప్'కు శ్రీకారం

వన సంరక్షణ పేరిట అటవీశాఖ స్పెషల్ డ్రైవ్

గూడూరు, జనవరి 28 : వన్యప్రాణుల వేటకు అడ్డుకట్ట వేసేందుకు అటవీశాఖ చర్యలు చేపట్టింది. వేటగాళ్ల నుంచి వాటిని రక్షించేందుకు శ్రీకారం చుట్టింది. రాష్ట్ర అటవీశాఖ ఆదేశాలతో మహబూబాబాద్ జిల్లాలో 'వన సంరక్షణ యాప్'ద్వారా 'క్యాచ్ ద ట్రాప్' అనే స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇందులో భాగంగా గత కొద్దిరోజులుగా అటవీశాఖ సిబ్బంది అడవులను జల్లెడ పడుతున్నారు. అడవుల్లో జంతువుల వేట కోసం ఏర్పాటు చేసిన వలలు, ఉచ్చులు, లైవ్‌వైర్లను గుర్తించి, తొలగిస్తున్నారు. దీంతో వన్య ప్రాణులకు ప్రాణాపాయం తప్పనుంది. అలాగేఉచ్చులు ఏర్పాటు చేస్తున్న వేటగాళ్లు కూడా ఎవరో తెలుసుకునేందుకు అవకాశం ఏర్పడుతుంది.

మరోపక్క పాత నేరస్తులు, అనుమానిత వేటగాళ్ల ఇళ్లలో కూడా అటవీశాఖ అధికారులు తనిఖీలు చేపడుతున్నారు. వలలు, ఉచ్చులు స్వాధీనం చేసుకుని హెచ్చరిస్తున్నారు. జిల్లాలో ఇప్పటికే ఏడు రేంజ్‌ల పరిధిలో వలలు, ఉచ్చులను గుర్తించారు. ప్రధానంగా అడవులు ఎక్కువగా ఉన్న ప్రాంతాలపై అధికారులు నిఘా పెట్టారు. జిల్లా మొత్తంలో ఏడు రేంజ్‌ల పరిధిలో 1.50 లక్షల ఎకరాల విస్తీర్ణంలో అటవీ ఉంది. జంతువుల దాహార్తిని తీర్చేందుకు అడవుల్లో సాసరపిట్లు, నీటి కుంటలు, సోలార్ పంప్‌సెట్లను ఏర్పాటు చేశారు. అడవిలో నీటి వనరులు ఉన్న ప్రాంతాలకు వన్యప్రాణులు అధికంగా వస్తుంటాయి. వేటగాళ్లు ఈ ప్రాంతాలపైనే లక్ష్యంగా చేసుకుని ఉచ్చులు, వలలు ఏర్పాటు చేస్తుంటారు. అటవీ సిబ్బంది వీటిని గుర్తించి నిర్వీర్యం చేయడమే వన సంరక్షణ 'క్యాచ్ ద ట్రాప్' యాప్ ప్రధాన లక్ష్యం.

సమాచారం ఇచ్చి, సహకరించాలి..

వన్యప్రాణులను వేటాడడం ఎప్పట్నుంచో నిషేధంలో ఉంది. కానీ, కొందరు వేటగాళ్లు జంతుమాంసం కోసం వన్యప్రాణులను వేటాడుతున్నారు. ముఖ్యంగా జింకలు, దుప్పులు, కుందేళ్లు, అడవి పందులు, తదితర వాటిని ఎక్కువగా వేటాడుతున్నారు. అలాగే రైతులు కూడా అడవి జంతువుల నుంచి తమపంట పొలాలను కాపాడుకునేందుకు వలలు ఏర్పాటు చేసుకుంటారు. ఇలా ఎక్కువగా ఉన్న అడవులను అనుకుని ఉన్న వ్యవసాయ క్షేత్రాల్లో జరుగుతూ ఉంటుంది. వలలో చిక్కుకున్న వన్య ప్రాణులు వేటగాళ్ల చేతుల్లోకి వెళ్తున్నాయి. పొలాల వద్ద వలలు ఏర్పాటు చేయకూడదని అటవీ సిబ్బంది రైతులకు సూచిస్తున్నారు. చెప్పినప్పటికి అలాగేచేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తున్నారు. అట్లాగే వేట ఉచ్చులను గుర్తించి, అత్యున్నతమైన పనితీరు కనబరిచిన సిబ్బందికి ప్రోత్సాహం కూడా ఇవ్వనున్నారు. అదే వన్యప్రాణులపై వేట జరుగుతున్న సమాచారం ఇచ్చిన వ్యక్తులకు తగిన పారితోషికం ఇవ్వనున్నట్లు అటవీశాఖ అధికారులు పేర్కొంటున్నారు. సమాచారం ఇచ్చినా, వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేస్తున్నారు.



వన్యప్రాణులను వేటాడేందుకు ఉపయోగించే విద్యుత్ ఇనుప వైర్లు ఇవే



పనితీరు మెరుగు పరిచేందుకే 'యాప్' ఏర్పాటు..

అటవీశాఖ సిబ్బంది పనితీరును మెరుగు పరిచేందుకే జిల్లా అటవీ అధికారి రవికిరణ్ వన సంరక్షణ యాప్‌కు శ్రీకారం చుట్టారు. ప్రతీరోజు క్షేత్రస్థాయి అధికారులు అటవీ ప్రాంతాల్లో పర్యటించాలి. ఈ యాప్ ఆయా ప్రాంతాల్లో పనిచేసే బీట్, సెక్షన్, డిప్యూటీ రేంజ్ అధికారులు, ఇతర విభాగాల అధికారులు వద్దకు వెళ్తేనే యాప్ ఓపెన్ అవుతుంది. దీంతో సిబ్బంది ఎక్కడ ఉన్నారనేది తెలుస్తుంది. తెలంగాణ రాష్ట్రంలో పైలెట్ ప్రాజెక్టుగా ఈ యాప్ మహబూబాబాద్ జిల్లాలో తొలిసారిగా ఆవిష్కృతమైంది. ఇక్కడ వచ్చిన ఫలితాలను బట్టి ఆయా జిల్లాల్లో ప్రారంభించనున్నట్లు సమాచారం.

అడవిపై నిరంతర నిఘా..

- సురేష్, రేంజ్ అధికారి, గూడూరు



ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అడవుల్లో జంతువుల కోసం ఏర్పాటు చేసిన వలలు, ఉచ్చులను గుర్తించి తొలగిస్తున్నాం. క్షేత్రస్థాయిలో సెక్షన్, బీట్ అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేసి నిఘా పెడుతున్నారు. వన్య ప్రాణులను వేటాడిన వారు ఎంతటివారైన సరే కఠిన చర్యలు తప్పవు. వన సంరక్షణ యాప్ ద్వారా క్షేత్రస్థాయి అధికారులు ప్రతిరోజు అడవుల్లో పర్యటిస్తున్నారు. జియో ట్యాగింగ్ ద్వారా ఫొటోలను 'ఆన్‌లైన్'లో నమోదు చేస్తున్నారు.

గిరిజన గురుకులాల్లో బదిలీలు, పదోన్నతులు చేపట్టాలి



మాట్లాడుతున్న టీఎస్‌యూటీఎఫ్ టీడబ్ల్యూ గురుకులాల విభాగం రాష్ట్ర అధ్యక్షుడు సురేందర్

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జనవరి 28 : గిరిజన గురుకులాల్లో బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని టీఎస్‌యూటీఎఫ్ టీడబ్ల్యూగురుకులాల విభాగం రాష్ట్ర అధ్యక్షుడు బి.సురేందర్ డిమాండ్ చేశారు. మహబూబాబాద్ ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో టీఎస్‌యూటీఎఫ్ టీడబ్ల్యూ గురుకులాల విభాగం జయశంకర్ భూపాలపల్లి రీజియన్ కమిటీ సమావేశాన్ని రాష్ట్ర కార్యదర్శి హట్కార్ బాలాజీ అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథిగా ఆయన హాజరై మాట్లాడుతూ గురుకులాల్లో గత ఆరేళ్లుగా బదిలీలు, పదోన్నతులు చేపట్టడం లేదని, 317 జీవోపై హైకోర్టు సూచనను అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మల్లారెడ్డి మాట్లాడుతూ సెలవు దినాల్లో పని చేసిన ఉపాధ్యాయులకు వీక్లిఆఫ్ ఇవ్వాలని, ప్రత్యేక వార్డెన్‌ను నియమించాలని డిమాండ్ చేశారు. అనంతరం జయశంకర్ భూపాలపల్లి రీజియన్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వి.తిరుపతి, ప్రధాన కార్యదర్శిగా ఈ.సురేష్, కోశాధికారిగా జి.సుమిత్ర, ఉపాధ్యక్షులుగా డి.బలరాం, ఎం రమారాణి, కె.రాకేష్, కార్యదర్శులుగా కృష్ణ, శైలజ, రమ, సుజాత, మహేశ్వరి, సునీత, రాజబాబు ఎన్నికయ్యారు. ఈ సమావేశంలో సంజీవ, శ్రీనివాస్, ప్రవీణ్‌కుమార్, రాజశేఖర్, శ్యామల పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులను విడుదల చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సిద్దోజు కవిత

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జనవరి 28 : ఆర్థికశాఖ వద్ద పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులను తక్షణమే విడుదల చేయాలని టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సిద్దోజు కవిత డిమాండ్ చేశారు. మహబూబాబాద్ పట్టణంలో టీపీటీఎఫ్ జిల్లా కమిటీ సమావేశాన్ని జిల్లా అధ్యక్షుడు చుంచు శ్రీశైలం అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం మూడు నెలలుగా నిలిపి వేసిన బిల్లులను చెల్లిస్తామని కాంగ్రెస్ తన మేనిఫెస్టోలో ప్రకటించిందని గుర్తు చేశారు. మరణించిన, ఉద్యోగవిరమణ పొందిన ఉపాధ్యాయులు ఆర్థిక చెల్లింపులు నెలలు, సంవత్సరాల తరబడి పెండింగ్‌లో ఉంచడం దారుణమన్నారు. జీవో నెంబరు 317తో స్థానికత కోల్పోయిన వారందరికి న్యాయం చేయాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి విష్ణువర్ధన్‌రెడ్డి, సోమారపు ఐలయ్య, బొల్లం శ్రీనివాస్, బలాష్టి రమేష్, సోమ విష్ణువర్ధన్, సాంబయ్య ఉపేందర్, సాయిబాబు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

- మునిసిపల్ చైర్మన్ పాల్వాయి రాంమోహన్‌రెడ్డి



రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న మునిసిపల్ చైర్మన్ పాల్వాయి రాంమోహన్‌రెడ్డి

మహబూబాబాద్ టౌన్, జనవరి 28 : అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని మునిసిపల్ చైర్మన్ పాల్వాయి రాంమోహన్‌రెడ్డి సూచించారు. మహబూబాబాద్ పట్టణంలోని సర్వేపల్లి జంక్షన్ నుంచి పత్తిపాకరోడ్ వరకు జరుగుతున్న బీటీరోడ్ నిర్మాణ పనులను ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనులు త్వరగా పూర్తి చేయాలని చెప్పారు. అలాగే మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీలతో తాగునీటి సమస్యలు తలెత్తుతున్నాయని, పైపులైన్ లీకేజీల వద్ద మరమ్మత్తులు చేపట్టాలని సూచించారు. వేసవి సమీపిస్తున్న తరుణంలో నీటి ఎద్దడి లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. ఏఈ సురేష్, బీఆర్‌ఎస్ అర్బన్ అధ్యక్షుడు గద్దె రవి పాల్గొన్నారు.



జిల్లా విద్యాశాఖ కార్యాలయం

ఎస్‌ఎంసీ రద్దుతో అయోమయం

స్కూల్ గ్రాంట్స్ వినియోగానికి హెచ్‌ఎం, చైర్మన్ సంతకాలు తప్పనిసరి

- వచ్చే విద్యా సంవత్సరంలోనే నూతన కమిటీలు
- ఉత్తర్వులు జారీ చేసిన విద్యాశాఖ

తొర్రూరు, జనవరి 28 : స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ (ఎస్‌ఎంసీ)లు ఏర్పాటు చేసేందుకు చేపట్టిన ఎన్నికల ప్రక్రియకు బ్రేక్ పడడంతో పాఠశాలల్లోని విద్యా కమిటీలు, హెచ్‌ఎంలలో గందరగోళం నెలకొంది. నూతన ఎస్‌ఎంసీ కమిటీలను ఏర్పాటు చేస్తుండటంతో ఇదివరకే ఉన్న పాత ఎస్‌ఎంసీ కమిటీలను రద్దు చేయడంతో స్కూల్ గ్రాంట్స్ వినియోగానికి హెచ్‌ఎం, చైర్మన్ సంతకం తప్పనిసరి కావడంతో ఏ విధంగా చేయాలనే దానిపై అయోమయం నెలకొంది. ఎన్నికల రద్దుకు సంబంధించి విద్యాశాఖ ఇప్పటికే ఉత్తర్వులు జారీ చేసింది.

దాదాపు నాలుగేళ్ల తర్వాత నిర్వహిస్తున్న ఎస్‌ఎంసీ ఎన్నికల నిర్వహణ ఆగిపోవడంతో తల్లిదండ్రులు, ప్రధానోపాధ్యాయులు సందిగ్ధంలో పడ్డారు. జిల్లాలోని పాఠశాలల్లో ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైనట్లు ఈ నెల 21న ప్రధానోపాధ్యాయులు తల్లిదండ్రులకు ఆహ్వాన పత్రాలను సైతం అందించారు. కానీ, ప్రభుత్వం మూడు రోజుల్లో నిర్ణయాన్ని మార్చుకుని వాయిదా వేసింది.

ఈ విద్యా సంవత్సరంలో ఎన్నికలు లేనట్టే..

రాష్ట్రంలో 2019లో ఎస్‌ఎంసీ ఎన్నికలు నిర్వహించారు. ప్రభుత్వం వాటి కాలపరిమితిని పొడిగించింది. పాత కమిటీల పదవీకాలం డిసెంబర్ 31తో ముగిసింది. నూతన కమిటీలను ఎన్నుకునేందుకు విద్యాశాఖ ఈనెల 20న నోటిఫికేషన్ జారీ చేయగా, ఈనెల 29న ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. అంతలోనే ఎన్నికలు రద్దుచేయడంతో పాటు ప్రస్తుతం ఉన్న విద్యా కమిటీలను కూడా రద్దు చేయాలని విద్యాశాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. మరో మూడునెలల్లో ఈ విద్యా సంవత్సరం ముగియనుంది.

పదో తరగతి పరీక్షల కోసం ఇప్పటికే పాఠశాలల్లో ప్రత్యేక ప్రణాళికలు, తరగతులు అమలు చేస్తున్నారు. దీంతో ఈ విద్యా సంవత్సరంలో కొత్త కమిటీలు ఏర్పాటయ్యే పరిస్థితి కనిపించడం లేదు. పాఠశాల నిర్వహణ, అభివృద్ధిలో కమిటీ సభ్యుల పాత్ర కీలకం అవడంతో ప్రధానోపాధ్యాయులుఆందోళన చెందుతున్నారు. నూతన విద్యా సంవత్సరంలోనే ఎన్నికలు నిర్వహించాలని, ఉపాధ్యాయ సంఘాల నుంచి డిమాండ్ రావడంతో వాయిదా పడినట్లు సమాచారం.

నిధుల వినియోగం ఎలా?

పాఠశాలల అభివృద్ధికి సంబంధించి ప్రభుత్వం నుంచి మంజూరైన నిధులు పాఠశాల హెచ్‌ఎం, ఎస్‌ఎంసీ చైర్మన్ జాయింట్ చెక్ పవర్ ఉంటుంది. ప్రస్తుత పాత కమిటీలు రద్దు కావడంతో నిధుల విడుదలపై ఎలాంటి స్పష్టత లేదు. జిల్లా వ్యాప్తంగా ఉన్నత పాఠశాలలు 102, ప్రాథమికోన్నత పాఠశాలలు 120, ప్రాథమిక పాఠశాలలు 676 ఉన్నాయి. వీటిలో సుమారు 896 స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీలు అమలులో ఉన్నాయి. ఇవేకాకుండా కస్తూర్బా పాఠశాలలు 15, మోడల్ స్కూల్స్ 8 ఉండగా వీటిల్లో సుమారు 53వేల మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. జిల్లాలోని పాఠశాలల్లో 50 శాతం నిధులు మాత్రమే ఎస్‌ఎంసీ ఖాతాల్లో జమ అయ్యాయి. ఈ నిధులు ఖర్చు చేస్తేనే ప్రభుత్వం మరో 50 శాతం నిధులు మంజూరు చేస్తామని విద్యాశాఖ మెలిక పెట్టినట్లు తెలుస్తుంది. ఈ విద్యా సంవత్సరం ముగిసేందుకు మరో 3 నెలలు మాత్రమే గడువు ఉండటంతో నిధుల వినియోగంపై ఎలా ముందుకు వెళ్తారని తెలియాల్సి ఉంది.

సమయం లేదు.. పనుల్లో వేగం పెంచండి..

- మహాజాతర ఏర్పాట్లు సకాలంలో పూర్తి చేయండి
- పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క
- మేడారంలో అధికారులతో సమీక్ష



జిల్లా కలెక్టర్, ఎస్పీ అధికారులతో సమావేశమైన సీతక్క

మేడారం, జనవరి 28 : మహాజాతర సమయం దగ్గర పడుతున్న నేపథ్యంలో మేడారంలో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖమంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు. జాతరకు సమయం దగ్గరపడుతున్న కొద్దీ.. భక్తుల రాక పెరుగుతోందని, వారికి మౌలిక సౌకర్యాలు కల్పించాలని అన్నారు. మంత్రి సీతక్క ఆదివారం రాత్రి 9 గంటల తర్వాత పర్యటించారు. పోలీసు కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో కలెక్టర్ ఇలాత్రిపాఠి, ఎస్పీ శబరీశ్, ఐటీడీఏ పీవో అంకిత్, అదనపు కలెక్టర్ శ్రీజ, ఆయాశాఖల అధికారులతో సమావేశమయ్యారు. ప్రధానంగా అంతర్గత, లింకు రోడ్ల పనులు కొనసాగుతుండటంవల్ల ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమవుతోందని, భక్తులు కూడా అసౌకర్యానికి గురవుతున్నారని సీతక్క అన్నారు. నాణ్యతలో రాజీ పడకుండా వారంలోగా రోడ్ల పనులన్నింటినీ పూర్తిచేయాలని ఆర్ అండ్‌బీ, పీఆర్ అధికారులకు సూచించారు. జంపన్నవాగులో భక్తుల పుణ్యస్నానాల కోసం సౌకర్యాలను విస్తరించాలని, సాధ్యమైనన్ని ఎక్కువ బ్యాటరీ ఆఫ్ ట్యాప్స్ అందుబాటులోకి తేవాలని అన్నారు. తాగునీటి సరఫరా, పారిశుధ్యం విషయంలో అలసత్వం వహించొద్దని, వీలైనన్ని ఎక్కువ ప్రాంతాల్లో సౌకర్యాలు కల్పించాలని అన్నారు. ఈ సమీక్షలో ఏటూరునాగారం ఏఎస్పీ సంకీర్త్, ఆర్‌అండ్‌బీ ఈఈ వెంకటేశ్, పీఆర్ ఈఈ జయంత్ పాల్గొన్నారు.

భక్తుల విడిది షెడ్లను ప్రారంభించిన మంత్రి

గోవిందరావుపేట/తాడ్వాయి : మేడారం భక్తుల కోసం గోవిందరావుపేట మండలం చల్వాయి, తాడ్వాయి మండల కేంద్రాలలో రూ.కోటి 50లక్షలతో నిర్మించిన విడిది షెడ్లను మంత్రి సీతక్క ఆదివారం ప్రారంభించారు. గోవిందరావుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రసవం కోసం వచ్చిన గర్భిణుల కోసం నిర్మించిన గదిని ప్రారంభించారు. అదే విధంగా దుంపెల్లిగూడెంలో రూ.20 లక్షలతో నూతనంగా నిర్మించిన గ్రామపంచాయతీ భవనానికి ప్రారంభోత్సవం చేశారు. ఈ కార్యక్రమాలలో ఐటీడీఏ పీవో అంకిత్, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

'రాహుల్‌గాంధీ ప్రధాని కావడం ఖాయం'

మహబూబాబాద్ టౌన్, జనవరి28 : వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అత్యధిక స్థానాలు గెలుచుకుని రాహుల్‌గాంధీ దేశప్రధాని కావడం ఖాయమని సీనియర్ నాయకుడు రాయపురం సాంబయ్య జోస్యం చెప్పారు. మహబూబాబాద్ పట్టణంలో ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీలో అన్నివర్గాలకు సముచిత స్థానం దక్కుతుందని పేర్కొన్నారు. గత 20 సంవత్సరాలుగా తాను కాంగ్రెస్‌లో పని చేస్తూ పార్టీ అభ్యున్నతికి అహర్నిశలు శ్రమిస్తున్నానని, వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో మహబూబాబాద్ నుంచి తనకు అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణలో ఎరుకల సామాజిక వర్గం ఆర్థికంగా, రాజకీయంగా ఎదిగేలా కాంగ్రెస్ కృషి చేయాలని కోరారు. రాగం మల్లయ్య, కట్ల పాపయ్య, కేతిరి ఉపేందర్, రాయపురం సంపత్, కోట ఎల్లేష్, తిరుమలేష్, భద్రయ్య, వెంకన్న, ఉపేందర్, ఎల్లయ్య, వీరేశం పాల్గొన్నారు.

కేంద్ర నిధులను దారి మళ్లించిన బీఆర్‌ఎస్

- కాంగ్రెస్ ప్రభుత్వం విచారణ జరపాలి
- పెండింగ్‌లో ఉన్న సర్పంచ్‌ల బిల్లులను వెంటనే చెల్లించాలి
- కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్



పంచముఖ ఆంజనేయస్వామికి అభిషేకం నిర్వహిస్తున్న ఎంపీ బండి సంజయ్

భీమదేవరపల్లి, జనవరి 28: రాష్ట్రంలో అభివృద్ధి పథకాలకు కేంద్ర ప్రభుత్వం వేలాది కోట్ల రూపాయల నిధులను విడుదల చేస్తే.. వాటిని బీఆర్‌ఎస్ ప్రభుత్వం దారి మళ్లించిందని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్ ఆరోపించారు. ఆదివారం సాయంత్రం హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొప్పూర్ పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయంలో ఆయన ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకుడు ఉపేందర్‌శర్మ, ఆలయ చైర్మన్ కాసం రమేష్‌గుప్తా, సర్పంచ్ గద్ద రాజమణి-సమ్మయ్యయాదవ్‌లు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలోని ఉత్సవ విగ్రహానికి అభిషేకాలు నిర్వహించారు. ఆలయ చైర్మన్ రమేష్‌గుప్తా, సర్పంచ్ రాజమణి-సమ్మయ్యయాదవ్‌లు ఎంపీ బండి సంజయ్‌కు శాలువా, జ్ఞాపికతో సత్కరించారు.

ఈ సందర్భంగా ఎంపీ బండి సంజయ్ విలేకరులతో మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ నిధులను బీఆర్‌ఎస్ ప్రభుత్వం దారి మళ్లించిన విషయంపై కాంగ్రెస్ ప్రభుత్వం విచారణ జరపాలన్నారు. గ్రామాల అభివృద్ధి కోసం సర్పంచ్‌లు వివిధ అభివృద్ధి పనులు చేశారన్నారు. వారు బిల్లులు రాక చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. సర్పంచ్‌ల పెండింగ్‌లో ఉన్న బిల్లులను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చెల్లించాలన్నారు. నూతనంగా గ్రామాల్లో సర్పంచ్‌లు గ్రామపంచాయతీ భవనాలను నిర్మించారన్నారు.

ఈనెల 31లోపు సర్పంచ్‌ల పదవీకాలం ముగియనుందన్నారు. ఆలోపు నూతన గ్రామపంచాయతీ భవనాలను ప్రారంభించాలని ఆయన కోరారు. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో నూతనంగా నిర్మించిన గ్రామపంచాయతీ బిల్డింగ్‌లను ప్రారంభించవద్దని కొంతమంది అధికారులు సర్క్యులర్ జారీ చేశారన్నారు. ఈ విషయం తన దృష్టికి వచ్చిందన్నారు. వెంటనే సర్క్యులర్ జారీ చేసిన అధికారులను వెంటనే సస్పెండ్ చేసి విచారణ జరపాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో త్వరలో జరగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ పదికి పైగా ఎంపీ స్థానాలను గెలుచుకుంటుందని బండి సంజయ్ ధీమా వ్యక్తం చేశారు. కొప్పూర్ పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయ అభివృద్ధికి రూ.20లక్షల నిధులు కేటాయిస్తానని ఆలయ చైర్మన్ కాసం రమేష్‌గుప్తాకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో హుస్నాబాద్ నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి బొమ్మ శ్రీరాంచక్రవర్తి, కరీంనగర్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, జిల్లా నాయకుడు దొంగల కొంరయ్య, బీజేపీ మండలాధ్యక్షుడు పైడిపల్లి పృథ్వీరాజ్‌గౌడ్, నాయకులు గుండెల్లి సదానందం, అంబీరు కవిత, నోముల భిక్షపతి, బైరి సదానందం తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు నాసిరకం బియ్యం సరఫరా

కేంద్ర మంత్రి పియూష్ గోయల్‌కు వినియోగదారుల మండలి ప్రతినిధుల ఫిర్యాదు

హనుమకొండ, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి వరంగల్ జిల్లాలో పౌరసరఫరాల శాఖ బియ్యం సరఫరాలో పాల్పడుతున్న అవతవకలపై వినియోగదారుల మండలి ప్రతినిధులు న్యూఢిల్లీలోని కేంద్ర వినియోగదారుల వ్యవహారాల మంత్రి పియూష్ గోయల్‌కు ఆదివారం ఫిర్యాదు చేశారు. పౌర సరఫరాల శాఖ అధికారులు మండల లెవల్ స్టాక్ పాయింట్ల నుంచి వివిధ చౌకడిపోఆల ద్వారా వినియోగదారులకు నాసిరకం, దొడ్డు బియ్యం సరఫరా చేస్తూ బియ్యాన్ని సేకరిస్తున్న రైస్ మిల్లర్లకు మేలు రకం బియ్యం ధర చెల్లిస్తున్నారని ఆ ఫిర్యాదులు జాతీయ వినియోగదారుల మండలి ప్రధాన కార్యదర్శి సాంబరాజు చక్రపాణి, సీసీఐ రాష్ట్ర అధ్యక్షుడు మొగిలిచెర్ల సుదర్శన్ పేర్కొన్నారు.



న్యూఢిల్లీలో కృషి భవనం ముందు వినియోగదారుల మండలి ప్రతినిధులు

ఉమ్మడి జిల్లాలో సివిల్ సప్లయిస్ గోదాములకు మిల్లర్లు ఇచ్చిన బియ్యం శాంపిళ్లను ప్రదర్శించడం లేదని, గోదాములు ఇన్‌చార్జీలు, ఫుడ్ ఇన్స్‌పెక్టర్లు, నాసిరకం బియ్యం బస్తాలకు ఫోర్టిఫైడ్ బియ్యం లేబుళ్లు వేస్తున్నారని ఆరోపించారు. ఈ విషయమైన తెలంగాణ ఆహార భద్రతా కమిషన్‌కు ఫిర్యాదుచేసినా పట్టించుకోవడం లేదని వారు తెలిపారు. వరంగల్ కార్పొరేషన్ పరిధిలోని పాఠశాలల్లో, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆహార భద్రతా చట్టం-2013 నిబంధనలు తప్పనిసరిగా అమలు జరిగేలా చూడాలని వినియోగదారుల మండలి ప్రతినిధులు కేంద్ర మంత్రి పియూష్ గోయల్‌ను కోరారు. ఈ మేరకు కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించి విచారణకు ఆదేశించారని వారు తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న జన్ను సాంబయ్య

పేదల సమస్యలపై రాజీలేని పోరాటం

రిపబ్లికన్ పార్టీ ఆఫ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు జన్ను సాంబయ్య

వడ్డేపల్లి, జనవరి 28: పేద ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం రాజీలేని పోరాటాలు చేయడమే తమ పార్టీ ఎజెండా అని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ తెలంగాణ (బొజ్జా తారకం) రాష్ట్ర అధ్యక్షుడు జన్ను సాంబయ్య అన్నారు. ఆదివారం హనుమకొండ రాంనగర్‌లోని కార్యాలయంలో నిర్వహించిన రాష్ట్ర కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని ప్రతి పేద కుటుంబానికి సొంత ఇల్లు ప్రభుత్వమే నిర్మించి ఇవ్వాలని, స్వయం ఉపాధి కల్పించాలని కోరారు. ప్రభుత్వ పాఠ్యపుస్తకాల్లో భారత రాజ్యాంగ పీఠిక ముద్రించాలని డిమాండ్ చేశారు. అనంతరం కమిటీని ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడిగా జన్ను సాంబయ్య, రాష్ట్ర చైర్మన్‌గా రెడ్డిమల్ల శ్రీనివాస్, గౌరవ సలహాదారులుగా బండి మొగిలి, మైదం జైపాల్, ఉపాధ్యక్షులుగా కొప్పుల రామారావు, నక్క భిక్షపతి, నాగెల్లి కోమల, రెడ్డిమల్ల పార్వతి, ప్రధాన కార్యదర్శిగా వి.స్వర్ణలత ఎన్నికయ్యారు. రాష్ట్ర కార్యదర్శిగా జమ్ముల నాగరాజు, రాష్ట్ర ప్రచార కార్యదర్శిగా బొచ్చు సాంబయ్య, బొడ్డు సత్యనారాయణలను ఎన్నుకున్నారు.

పులిమడుగును సందర్శించిన డీఎఫ్‌వోలు



పులిమడుగును సందర్శిస్తున్న డీఎఫ్‌వోలు రవి కిరణ్, అర్పణ

గూడూరు (మహబూబాబాద్ జిల్లా), జనవరి 28 : గూడూరు అటవీశాఖ పరిధిలోని కార్లాయి సెక్షన్ పరిధిలోని పులి మడుగును మహబూబాబాద్ డీఎఫ్‌వో రవికిరణ్, వరంగల్ డీఎఫ్‌వో అర్పణ ఆదివారం సందర్శించారు. పులిమడుగులో ఇటీవల నిర్వహించిన క్యాంపెన్ క్వాటర్‌ను పరిశీలించి పులిమడుగులో బోటింగ్ చేశారు. అటవీ వనరులు ఆక్రమణకు గురికాకుండా ఉండేందుకు అటవీశాఖ ఇటీవల ఈ క్వార్టర్‌ను నిర్మించిన సంగతి తెలిసిందే. కాగా, ఒకేశాఖలో ఒకేక్యాడర్‌లో పని చేస్తున్న ఈ ఇరువురు డీఎఫ్‌వోలు దంపతులు కావడం విశేషం.

10 కిలోల గంజాయి స్వాధీనం

వరంగల్‌సిటీ, జనవరి 28: ఎక్సైజ్ ప్రొహిబిషన్ డిప్యూటీ కమిషనర్ ఆదేశాల మేరకు గంజాయి నిర్మూలనకు చేపడుతున్న కార్యక్రమంలో భాగంగా ఆదివారం వరంగల్ రైల్వే స్టేషన్‌లో తనిఖీ నిర్వహించారు. ఈ తనిఖీల్లో కోణార్క్, సింగరేణి ప్యాసింజర్, సీటీటీ రైళ్లలో తనిఖీలు చేపట్టారు. రైలు ద్వారా ఎండు గంజాయిని రవాణా చేస్తున్న ఒడిషా రాష్ట్రానికి చెందిన సంజయ్ నాయక్‌ను పట్టుకుని అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి 10 కిలోల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఖిలావరంగల్ ఎక్సైజ్ సీఐ బి.చంద్రమోహన్ తెలిపారు. ఈతనిఖీల్లో సీఐ నీరజ, ఖిలావరంగల్ ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

తపాలా సేవలు పొడిగింపు

- వరంగల్ హెడ్‌పోస్టాఫీసులో ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు..
- ఇంటి వద్దనే శిశు ఆధార్ ఉచితం
- విదేశాలకు అందుబాటు ధరలతో పార్సిల్స్

గిర్మాజిపేట(వరంగల్), జనవరి 28: ఉత్తరాలు, పార్సెల్స్, బ్యాంకింగ్, జీవిత బీమా పథకాల సేవలను ప్రజలకు అందచేస్తున్న వరంగల్ హెడ్‌పోస్టాఫీసు పని వేళలను ప్రజలకు మరింతగా అందుబాటులోకి తీసుకువచ్చింది. తెలంగాణ రాష్ట్రంలోని అన్ని పోస్టాఫీసులు రోజుకు 8 గంటలు పనిచేస్తుండగా వరంగల్‌లోని హెడ్‌పోస్టాఫీసు 12 గంటలు పనిచేస్తూ ప్రజలకు మరింత విస్తృతంగా తపాలా సేవలను అందచేస్తోంది. అంతేకాదు 5 ఏళ్ల లోపు పిల్లలకు ఇంటి వద్దనే ఉచితంగా పోస్టుమన్ ద్వారా శిశు ఆధార్ నమోదు సదుపాయాన్ని అందుబాటులోకి తీసుకువచ్చింది. వరంగల్ రైల్వేస్టేషన్ రోడ్డులో ఉన్న హెడ్‌పోస్టాఫీసు సేవలు ఇలా వున్నాయి.

తపాలా సేవలివే..

వరంగల్ హెడ్‌పోస్టాఫీసులో పలురకాల తపాలా సేవలు లభిస్తున్నాయి. రెవెన్యూ, పోస్టల్ స్టాంపుల విక్రయం, దేశ, విదేశాలకు ఉత్తరాలు, పార్సెల్స్ పంపిణీ, ఇండియన్ పోస్టల్ బ్యాంకింగ్, తపాలా సేవింగ్ పథకాలు, చిన్నమొత్తాల పొదుపు పథకాలు, తపాలా బీమా పథకాలు ప్రజలు పొందుతున్నారు.

ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు..

హెడ్‌పోస్టాఫీసు పనివేళలు గతంలో ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు ఉండేవి. ఈ సమయంలోనే ప్రజలు తపాలా సేవలు పొందేవారు. అయితే సాయంత్రం 5.30 గంటలు దాటితే హెడ్‌పోస్టాఫీసు మూసివేసేవారు. దీంతో తపాలా సేవలు అందక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యేవారు. దీన్ని గుర్తించిన తపాలా శాఖ రాష్ట్రంలో సికింద్రాబాద్, వరంగల్ హెడ్‌పోస్టాఫీసు పని వేళలను ప్రస్తుతం 8 గంటల పని విధానాన్ని 12 గంటలకు పొడిగించింది. ఈ మేరకు వరంగల్ డివిజనల్ పోస్టల్ సూపరింటెండెంట్ స్వామి వెంకటలక్ష్మినరసింహారావు వరంగల్ హెడ్‌పోస్టాఫీసు పనివేళలను ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులోకి తీసుకువచ్చారు. దీంతో ప్రతి రోజు ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు హెడ్‌పోస్టాఫీసు పనిచేస్తున్నది.

ఇంటి వద్దనే శిశు ఆధార్ నమోదు

తపాలాశాఖ ఇంటి వద్దనే పోస్టుమన్ ద్వారా ఉచితంగా శిశువుల ఆధార్ నమోదు చేస్తోంది. ఇందుకు గాను వరంగల్ హెడ్‌పోస్టాఫీసు పరిధిలోని పోస్టుమన్‌లకు ఆధార్ నమోదుపై శిక్షణ ఇచ్చారు. 0 నుంచి 5 సంవత్సరాల శిశువుల ఆధార్ నమోదు కోసం తల్లిదండ్రులు ఆధార్ సెంటర్‌కు వెళ్లాల్సిన అవసరం లేదు. తమ ప్రాంతానికి వచ్చే పోస్టుమన్‌ను తల్లిదండ్రులు కలిసి శిశువులకు కొత్తగా ఆధార్ నమోదు చేసుకోవచ్చు. పోస్టుమన్‌లు తమ వద్ద ఉన్న సెల్‌ఫోన్ ద్వారా తల్లిదండ్రుల సమాచారం, ఆధార్‌కార్డుల సమాచారంతో 0 నుంచి 5 సంవత్సరాల శిశువుల ఆధార్ నమోదు ఉచితంగా చేస్తారు. ఇందుకు గాను ఎలాంటి డబ్బులు చెల్లించాల్సిన అవసరం లేదు.



వరంగల్ హెడ్‌పోస్టాఫీసు

పోస్టాఫీసులో ఆధార్ సేవా కేంద్రం

వరంగల్ హెడ్‌పోస్టాఫీసులో ప్రత్యేకంగా ఆధార్ సేవా కేంద్రం పనిచేస్తోంది. ఇందులో కొత్తగా ఆధార్ నమోదు మాత్రం ఉచితంగా చేస్తారు. అయితే ప్రస్తుత ఆధార్ కార్డులో పేర్లు, ఇంటిపేర్లు, చిరునామా, పుట్టిన తేది, ఫొటో, వేలిముద్రలు తదితర సవరింపులను మాత్రమే ఆధార్ సంస్థ నిర్ణయించిన ఫీజుతో చేస్తారు. ప్రస్తుత ఆధార్‌లో ఇంటి పేరు, పేరు, పుట్టిన తేది, చిరునామా తదితర మార్పుల కోసం తప్పనిసరిగా సంబంధిత సర్టిఫికెట్ వెంట తెచ్చుకోవాల్సి ఉంటుంది. పుట్టిన తేది సవరణకు విద్యాసంస్థ, మునిసిపల్ బర్త్ సర్టిఫికెట్, పాస్‌పోర్టుతో చేసుకోవచ్చు. ఈ ఆధార్ సెంటర్ కూడా ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు పనిచేయనుంది. ఆధార్ డౌన్‌లోడ్, ప్రింట్‌కు రూ.30 చెల్లించాలి.

అందుబాటు చార్జీలతో పార్సెల్స్

విదేశాలలో ఉంటున్న తమ కుటుంబ సభ్యులకు అవసరమైన వస్తువులు, మందులు, పిండివంటలు తదితర పార్సెల్స్‌ను వరంగల్ హెడ్‌పోస్టాఫీసు సెంటర్‌లోని ప్రత్యేక పార్సెల్ కేంద్రం ద్వారా పంపవచ్చు. ప్రయివేట్ కొరియర్ సర్వీసుల కంటే తక్కువ చార్జీలు ఉన్నాయని తపాలా అధికారులు చెబుతున్నారు. నామమాత్రపు చార్జీతో అధునాతన ప్యాకింగ్ యంత్రంతో పార్సెల్స్‌ను ప్యాకింగ్ చేస్తున్నారు. ప్యాకింగ్ సైజ్ మేరకు చార్జి ఉంటుంది. ప్రతి అర కిలో(500 గ్రాములు)కు అమెరికాకు రూ.1,550, కెనడాకు రూ.1,180, ఆస్ట్రేలియాకు రూ.975, యూకేకు రూ.1,570 చార్జి ఉంటుంది. ప్రపంచంలోని దాదాపు అన్ని దేశాలకు తపాలా శాఖ విదేశీ పార్సెల్స్ సదుపాయం ఉందని అధికారులు చెబుతున్నారు.



పార్సెల్స్ యంత్రం

తపాలా బీమా పథకాలు

సామాన్య, మధ్య తరగతి వర్గాలకు అందుబాటులో వివిధ జీవిత, ప్రమాద బీమా పథకాలను తపాలా శాఖ అమలు చేస్తోంది. టాటా, ఏఐజీ సహకారంతో రూ.10 లక్షలు, రూ.5 లక్షల యాక్సిడెంటల్ బీమా పాలసీని అమలు చేస్తోంది. 18 నుంచి 65 సంవత్సరాల లోపు కలిగిన వారు సంవత్సరానికి రూ.520 చెల్లిస్తే రూ.10 లక్షల యాక్సిడెంటల్ బీమా, రూ.320 చెల్లిస్తే రూ.5 లక్షల యాక్సిడెంటల్ బీమా వర్తిస్తుందని తపాలా అధికారులు తెలిపారు. అలాగే నీవా బుపా హెల్త్ ఇన్సురెన్స్ సంస్థతో కలిసి తపాలా శాఖ సంవత్సరానికి రూ.755 ప్రీమియంతో రూ.15లక్షల హెల్త్ ఇన్సురెన్స్ పాలసీని అమలు చేస్తోంది. ఇవే కాకుండా సేవింగ్ అకౌంట్‌లు, డిపాజిట్ పథకాలతో పిల్లలకు సుకన్య సమృద్ధి యోజన, సీనియర్ సిటిజన్‌లు, మహిళల కోసం ప్రత్యేక డిపాజిట్, సేవింగ్, నెలవారి ఆదాయం స్కీంలను తపాలా శాఖ అమలు చేస్తున్నది.

తపాలా సేవలు వినియోగించుకోండి

ఎస్‌వీఎల్ఎన్ రావు, పోస్టల్ సూపరింటెండెంట్



ప్రజలకు మరింత మెరుగైన తపాలా సేవలను అందించేందుకు గాను వరంగల్ హెడ్‌పోస్టాఫీసు పని వేళలను 12 గంటలకు పెంచాం. ప్రతి రోజు ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు ప్రజలు హెడ్‌పోస్టాఫీసులో తపాలా సేవలు పొందవచ్చు. తమ ప్రాంత పోస్టుమన్‌ల ద్వారా ఉచితంగా ఇంటి వద్దనే శిశు ఆధార్ నమోదును తల్లిదండ్రులు వినియోగించుకోవాలి. అలాగే తపాలా బ్యాంకింగ్, జీవిత, ప్రమాద బీమా పథకాలు, అందుబాటు చార్జీలతో విదేశాలకు పార్సెల్స్ సదుపాయం కూడా ఉంది.



వేడుకలను ప్రారంభిస్తున్న నిట్ డైరెక్టర్ విద్యాధర సుబుద్ధి

ఏకశిల జూనియర్ కళాశాలల సెలబ్రేషన్స్

ముఖ్య అతిథులుగా నిట్ డైరెక్టర్ విద్యాధర సుబుద్ధి, ఇన్‌కం ట్యాక్స్ కమిషనర్ జీవన్‌లాల్ లావుడియా

హనుమకొండ రూరల్, జనవరి 28: ఏకశిల జూనియర్ కళాశాలల స్పార్క్‌రిల్ సెలబ్రేషన్స్ హసన్‌పర్తి పెంబర్తిలోని ఏకశిల టెక్నో స్కూల్‌లో ఆదివారం ఘనంగా జరిగాయి. ఏకశిల విద్యాసంస్థల చైర్మన్ గౌరు తిరుపతిరెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నిట్ డైరెక్టర్ ప్రొఫెసర్ విద్యాధర సుబుద్ధి, ఇన్‌కం ట్యాక్స్ కమిషనర్ జీవన్‌లాల్ లావుడియా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాలం విలువ గుర్తించిన వారే విజయ సోపానాలు పొందుతారని అన్నారు. ఎవరి సమయం వారికి మంచి అవకాశాలు ఇస్తుందని, దానిని సద్వినియోగం చేసుకున్నవారే విజేతలుగా నిలుస్తారని తెలిపారు. విద్యాసంస్థల చైర్మన్ గౌరు తిరుపతిరెడ్డి మాట్లాడుతూ.. ఐఐటీ, నీట్ పోటీ పరీక్షలలో ఎంపికైన ఏకశిల విద్యార్థులకు రూ.10వేల నగదు పారితోషికం ప్రకటించారు. ఇంటర్ మొదటి సంవత్సరం టాపర్స్‌కి రెండో సంవత్సరంలో ఫీజులో రాయితీ ఇవ్వనున్నట్లు ప్రకటించారు. కళాశాల విద్యార్థులు ప్రదర్శించిన ఆటపాటలు అలరించారు. ఈ కార్యక్రమంలో విద్యాసంస్థల డైరెక్టర్ గౌరు రాజిరెడ్డి, బేతి కొండల్‌రెడ్డి, గౌరు సువిజ తిరుపతిరెడ్డి, ముచ్చ జితేందర్‌రెడ్డి, కళాశాలల ప్రిన్సిపాల్స్ ఇ.తిరుపతిరెడ్డి, జి.సుధాకర్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తెలంగాణలో పది సీట్లు గెలుస్తాం..

- బీఆర్ఎస్ మూడోస్థానానికే పరిమితం
- కేటీఆర్ నోరు అదుపులో పెట్టుకోవాలి
- కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్



అధికారులతో కలిసి పనులను పరిశీలిస్తున్న ఎంపీ సంజయ్

కమలాపూర్, జనవరి 28: వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ పార్టీ తెలంగాణలో పదిసీట్లు గెలుస్తామని కరీంనగర్ ఎంపీ, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్‌కుమార్ అన్నారు. కమలాపూర్ మండలంలోని ఉప్పల్ గ్రామంలోని రైల్వే గేటు వద్ద నిర్మిస్తున్న ఆర్‌వోబీ పనులను ఆదివారం సాయంత్రం రైల్వే అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. నిర్ణీత గడువులోగా బ్రిడ్జి నిర్మాణ పనులను పూర్తి చేయాలని అధికారులను కోరారు. కొవిడ్-19, ఆర్వోబీ డిజైన్ మార్పు వల్ల నిర్మాణ పనుల్లో జాప్యం జరిగిందన్నారు. బ్రిడ్జి నిర్మాణంపై ఇదివరకు అధికారులతో రెండు, మూడు సార్లు సమీక్ష సమావేశం నిర్వహించామన్నారు. కేంద్ర ప్రభుత్వ పనులు ఆగవని, గత ప్రభుత్వం సహకరించకపోవడంతోనే నిర్మాణం అలస్యమైందన్నారు. పనులను వేగవంతం చేయాలని సూచించారు. ఉప్పల్ రైల్వే స్టేషన్‌లో టిక్కెట్ రిజర్వేషన్ కౌంటర్‌ను ఏర్పాటు చేస్తామని, రైల్వేస్టేషన్‌ను అభివృద్ధి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు.

అనంతరం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. రాష్ట్ర మాజీ మంత్రి కేటీఆర్ నోరు అదుపులో పెట్టుకోవాలని అన్నారు. తన తండ్రి పేరు చెప్పుకొని కేటీఆర్ రాజకీయాల్లోకి వచ్చాడని, తాను పోరాటం చేసి పైకి వచ్చానని అన్నారు. తాను హిందు ధర్మం కోసం మాట్లాడితే తనను మతం పెట్టుకొమ్మని కేటీఆర్ అంటున్నాడని ఆయన ఆరోపించారు. పదే, పదే ముస్లింల గురించి మాట్లాడుతున్న కేటీఆర్ మసీదు కట్టుకొని నమాజ్ చేయాలని, ప్రజలకు అందుబాటులో లేకుండా ఫాంహౌస్‌లో ఉన్న కేసీఆర్‌కు సీఎం పదవి అవసరం లేదని బార్ కట్టుకోవాలని ఆయన విమర్శించారు. మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గంలో ఏమి అభివృద్ధి పనులు చేయలేదని విమర్శించారు. కేటీఆర్, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్‌లు ఇద్దరు నాస్తికులు అని, నియోజకవర్గంలో మెజారిటీ ప్రజలు దేవుళ్లను పూజిస్తారని, దేవుడిని పూజించే ప్రజలు దేవుడిని నమ్మనివారికి ఓట్లు వేస్తారా? అని ఆయన ప్రశ్నించారు. ప్రధానిగా నరేంద్ర మోదీ ఉండాలని ప్రజలు కోరుకుంటున్నారని, వచ్చే పార్లమెంట్ ఎన్నికలలో బీజేపీ పది స్థానాలను గెలుస్తుందని, బీఆర్ఎస్ పార్టీ మూడో స్థానానికే పరిమితమవుతుందని ఆయన అన్నారు.

ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు గుండ్ర నళిని, కరీంనగర్ బీజేపీ జిల్లా అధ్యక్షుడు కృష్ణారెడ్డి, బొమ్మ శ్రీరాం చక్రవర్తి, పుప్పాల రఘు, గౌతంరెడ్డి, మాట్ల రమేష్, కట్కూరి అశోక్‌రెడ్డి, తుమ్మ శోభన్‌బాబు, సర్పంచ్ శ్రీనివాస్, ఎంపీటీసీ శ్రీనివాస్, బండారి సుధాకర్, తోట సురేష్, చిట్టి సుందరయ్య, ర్యాకం శ్రీనివాస్, అంజయ్య, భూపతి ప్రవీన్, కార్యకర్తలు తదితతరులు పాల్గొన్నారు.

వైభవంగా గొంతెమ్మగుట్ట మహాజాతర

కాటారం, జనవరి 28: మండలంలోని ప్రతాపగిరి శివారు అటవీప్రాంతంలోని గొంతెమ్మ గుట్టపై మూడు రోజుల పాటు నిర్వహించిన లక్ష్మీదేవర మహాజాతర ఆదివారంతో ముగిసింది. చివరి రోజు అంగరంగ వైభవంగా జరిగింది. పలు ప్రాంతాల నుంచి వచ్చిన నాయకపోడ్ కులస్థులు, జాతర నిర్వాహకులు 15కి పైగా లక్ష్మీదేవరలతో డప్పు చప్పుళ్ల, శివసత్తుల పూనకాల మధ్య గొంతెమ్మ, లక్ష్మీదేవర పెద్ద పట్నాలు వేసి బోనాలు సమర్పించారు. అనంతరం లక్ష్మీదేవరల విన్యాసాలతో పట్నాలు తొక్కించే కార్యక్రమం చేపట్టారు. భూపాలపల్లి ఎస్పీ కిరణ్‌ఖరే దంపతులు, పలువురు పోలీసు అధికారులు, ఎంపీపీ పంతకాని సమ్మయ్య, ఎంపీటీసీలు రవీందర్‌రావు, మహేశ్వరి, విజయారెడ్డి, బోడ మమత, సర్పంచులు లక్ష్మి, దేవేందర్, రఘురాం, అశోక్, నరేష్, శేఖర్, రమేష్, కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ, బీఎస్పీ నేతలు జాతరలో పాల్గొని దేవతలకు మొక్కులు చెల్లించుకున్నారు. ఉమ్మడి కరీంగనర్, ఉమ్మడి వరంగల్ జిల్లాల్లోని పలు ప్రాంతాలతోపాటు మహారాష్ట్రకు చెందిన భక్తులు అటవీమార్గం మీదుగా ప్రైవేటు వాహనాల్లో జాతరకు తరలివచ్చారు. గుట్టపై సొరంగంలోని గొంతెమ్మ, కృష్ణుడి పాదాలు, శివలింగానికి భక్తులు మొక్కుకున్నారు. ఇరుకైన దారి గుండా భక్తులు త్వరగా వెళ్లడానికి దూసుకురాగా పోలీసులు, నిర్వాహకులు ఒక్కోసారి కొద్దిమందిని వదులుతూ దర్శనం కల్పించారు. సీఐ రంజిత్‌రావు నేతృత్వంలో ఎస్సైలు అభినవ్, సుధాకర్, నరేష్, లక్ష్మణ్‌రావు సీఆర్‌పీఎఫ్, సివిల్ పోలీస్ బలగాలతో బందోబస్తు చేపట్టారు. పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ మౌనిక, గీత, సుప్రియ వైద్యసిబ్బందితో కలిసి వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. గుట్టకు వెళ్లే దారి అటవీ ప్రాంతంలో ఇరుకుగా, కచ్చా రోడ్డు ఉండటంతో వచ్చి పోయే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దారి గుండా ఒకే వాహనం వెళ్లే వీలుండటంతో వాహనదారులు ఇక్కట్లు ఎదుర్కున్నారు. పలువురు దాతల సహకారంతో జాతర కమిటీ సభ్యులు భక్తులకు అన్నదానం నిర్వహించారు. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ప్రస్తుత జాతరకు ప్రభుత్వం రూ.20 లక్షల నిధులు మంజూరు చేయించిన తాత్కాలిక ఏర్పాట్లే జరిగాయని, రాబోయే జాతరకు ప్రభుత్వం భారీగా నిధులు కేటాయించి శాశ్వతంగా అభివృద్ధి చేయడంతో పాటు భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలని పలువురు కోరుతున్నారు. పలు పార్టీల నాయకులు వేమునూరి ప్రభాకర్‌రెడ్డి, గద్దె సమ్మిరెడ్డి, అంగోత్ సుగుణ, సుజాత, వంశవర్ధన్‌రావు, తిరుపతిరావు, సురేందర్‌రెడ్డి, మధుకర్, కుమార్, కొమురయ్య, రామిళ్ల కిరణ్, రత్న సౌజన్య, జోడు శ్రీనివాస్, దబ్బెట రాజేషం, శేఖర్, రాజేంద్రాచారి తదితరులు జాతరలో పాల్గొని మొక్కులు సమర్పించుకున్నారు. పోతురాజుల విన్యాసాలు, నాయకపోడు కళాబృందాల సాంస్కృతిక కార్యక్ర మాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో జాతర నిర్వాహకులు మేకల సంతోష్, గుంటి రాజేందర్, పోచం, పెద్ద కిష్టయ్య, చిన్నకిష్టయ్య, పోలం సంతోష్, సురేందర్, గుంటి రమేష్, గుంటి అశోక్, మధునయ్య మల్లేష్, ప్రతాప్, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.



గొంతెమ్మకు బోనాలు సమర్పిస్తున్న భక్తులు



మల్లన్నకు హారతి ఇస్తున్న వీరశైవార్చకులు

కొమురవెల్లి మల్లన్నకు లష్కర్ బోనాలు

భక్తులతో పోటెత్తిన మల్లన్న ఆలయం

చేర్యాల, జనవరి 28: కొమరవెల్లి మల్లిఖార్జునస్వామి దేవాలయం లష్కర్ భక్తులతో పోటెత్తింది. మల్లన్న బ్రహ్మోత్సవాలలో భాగంగా సంక్రాంతి తరువాత వచ్చిన రెండవవారమైన ఆదివారం రోజున సికిందరాబా దుకు చెందిన వేలాదిమంది భక్తులు స్వామి వారి దర్శనార్థం తరలివ చ్చారు. ఇలవేల్పు దైవాన్ని దర్శించు కుని పులకించిపోయారు. ఆలయ ప్రాంగణంలో విక్రయించే కూరగాయలను కొనుగోలు చేసి నూతన మట్టి కుండల్లో బోనం చేసి మల్లన్నకు నివేదించి పట్నాలు వేశారు. తమ కోరికలు నెరవేర్చమని ఆలయప్రాంగ ణంలోని గంగరేగుచెట్టుకు ముడుపులు కట్టారు. ఒడుబియ్యాలు పోసి తమను సల్లంగా కాపాడమని వేడు కున్నారు. తమకు సంతానం కలగాలని వేడుకుంటూ ఒళ్లుబండ వద్ద వరంపట్టారు.

ఎల్లమ్మతల్లికి ఘనంగా బోనాలు

మల్లన్న సహోదరి ఎల్లమ్మదేవతకు బోనంచేసి డప్పుచప్పుళ్ల హోరుతో, పూనకంతో శివమెత్తారు. దేవతలనా మస్మరణతో గుట్టపైకి ఎక్కి బోనాన్ని సమర్పించారు. భక్తులరద్దీ అధికంగా ఉండడంతో ప్రత్యేక, ధర్మదర్శన క్యూలైన్లు కిక్కిరిసిపోయాయి. దీంతో గంటల తరబడిగా పడిగాపులు కాయడంతో తీవ్ర ఇబ్బందులుపడ్డారు. పట్నాలు వేసిన భక్తులతో గంగిరేగుచెట్టు ప్రాంగణం కిటకిటలాడింది. మొక్కుబడిగా భక్తులు కట్టిన ము డుపులతో గంగరేగుచెట్టు నిండిపోయింది. ఈవో బాలాజీశర్మ ఏర్పాట్లు పర్యవేక్షించారు. హుస్నాబాద్ ఏసీపీ వాసాల సతీశ్, చేర్యాల సీఐ సత్యనారాయణరెడ్డి పర్యవేక్షణలో కొమురవెల్లి ఎస్ఐ నాగరాజు ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.



బోనాలు తీసుకువస్తున్న లష్కర్ భక్తులు

గ్యాస్ సిలిండర్‌లో నీరు



గ్యాస్ సిలిండర్‌ను పరిశీలిస్తున్న వినియోగదారుడు

వర్ధన్నపేట, జనవరి 28 : వంట గ్యాస్ వినియోగదారునికి వింత అనుభవం ఎదురైంది. సిలిండర్‌లో వంట గ్యాస్ ఇంధనానికి బదులు నీరు ఉండటంతో అవాక్కు అయ్యారు. వర్ధన్నపేట పట్టణానికి చెందిన ఆకుల సత్యం అనే వినియోగదారుడు ఎప్పటిలాగే గ్యాస్ బుక్ చేశాడు. సంగెం మండలంలోని ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ నుంచి సిలిండర్ రాగానే స్టౌవ్‌కు పెట్టి వెలిగించాడు. ఎంత చూసిన మంట రాకపోవడంతో అనుమానం వచ్చి సిలిండర్‌ను పరిశీలించాడు. దీంతో గ్యాస్ సిలిండర్‌లో గ్యాస్ కాకుండా నీరు ఉండటాన్ని గమనించి నిర్ఘాంతపోయాడు. వెంటనే గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులపై మండిపడుతూ వారిపై చర్యలు తీసుకొని వినియోగదారులకు నాణ్యమైన సిలిండర్ అందించాలని డిమాండ్ చేశారు

వీధి కుక్కలకు చర్మవ్యాధులు

గ్రామాల్లో విచ్చలవిడిగా తిరుగున్న వైనం ● మహబూబాబాద్ జిల్లాప్రజలకు పొంచి ఉన్న ముప్పు



మరిపెడ (మహబూబాబాద్ జిల్లా), జనవరి 28 : మహబూబాబాద్ జిల్లా మరిపెడ మునిసిపల్‌తో పాటు మండలంలోని వివిధ గ్రామాల్లో వీధికుక్కలు చర్మ వ్యాధుల బారిన పడి భయానక వాతావరణం సృష్టిస్తున్నాయి. ఏ గల్లీకి వెళ్లినా వ్యాధి బారిన పడిన కుక్కలే దర్శనమిస్తున్నాయి. కుక్కలకు సోకిన వ్యాధితో మానవాళి మనుగడకు సైతం భారీ ప్రమాదం వాటిల్లే అవకాశాలున్నాయి. విచ్చలవిడిగా వ్యాధుల బారిన కుక్కలచే రోగాలు వ్యాప్తి చెందే ప్రమాదం పొంచి ఉందని ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. యుద్ధ ప్రతిపాదికన నివారణ చర్యలు తీసుకోవాల్సిన అధికార యం త్రాంగం నిమ్మకు నీరేత్తినట్లు వ్యవహరిస్తోంది. గ్రామ పంచాయతీల్లో అరకొరగా నిధులు ఉండటంతో సర్పంచ్‌లు సైతం చేతులెత్తేస్తున్నారు. కరోనా మహమ్మారి బారినుంచి ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న ప్రజలకు కుక్కల ద్వారా మరో ప్రమాదం ముంచుకొస్తుందనే ఆందోళనతో కొట్టుమిట్టాడుతున్నారు.

మరిపెడ, చిన్నగూడూరు, నర్సింహులపేట, దంతాలపల్లి, కురవి తదిరత మండలాల పరిధిలోని ఏ గ్రామంలోకి వెళ్లిన చర్మ వ్యాధుల బారిన పడిన వీధి కుక్కలు దర్శనమిస్తున్నాయని జనం వాపోతున్నారు. కుక్కలకు చర్మ వ్యాధుల నివారణ చర్యలు తీసుకోవాల్సిన జిల్లాలోని మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీలు నిధుల కొరతతో వీధికుక్కల నిర్మూలనను గాలికొదిలేస్తున్నారు. కుక్కల చర్మ వ్యాధుల ద్వారా ప్రజలకు ప్రమాదం జరుగక ముందే రక్షణ చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



జిల్లాలో పలువురు బాధితులు

మహబూబాబాద్ జిల్లాలోని నాలుగు మునిసిపాలిటీలు, 461 గ్రామపంచాయతీలు ఉండగా, రెండు నెలలుగా కుక్క కాటుకు గురైన వారు అనేక మంది ఉన్నారు. చిన్నగూడూరు మండలం ఉగ్గంపల్లిలోనే 12 మందిని ఒకేరోజు ఊర కుక్కలు దాడి చేసి గాయపరిచాయి. జిల్లా వ్యాప్తంగా గత సంవత్సరం మార్చి మాసం నుంచి డిసెంబరు వరకు 21 పీహెచ్‌సీల పరిధిలో సుమారు 4,000మందికి పైగా కుక్క కాటుతో గాయపడ్డారు. మరిపెడ మండలానికి చెందిన ఓ వ్యక్తి కుక్క కాటుకు గురియ్యై ఇటివలనే హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు.

జాగ్రత్త వహించడమే ఏకైక మార్గం

రమేశ్, వెటర్నరీ డాక్టర్, ఎడ్జర్ల



చర్మ వ్యాధుల బారిన పడ్డ కుక్కల పట్ల ప్రజలు జాగ్రత్తలు వహించడం ఒక్కటే మార్గం. వీధి కుక్కలకు సోకిన చర్మ వ్యాధుల నివారణకు ప్రభుత్వం నుంచి మందుల సరఫరా లేదు. కుక్కల సొల్లుద్వారా రేబీస్ వ్యాధి వ్యాప్తి చెందే ప్రమాదం ఉంది. గ్రామ పంచాయతీ సిబ్బందికి, ప్రజలకు అవగాహన కల్పించి తగు జాగ్రత్తలు పాటించాలి. వీటితో పాటు కుక్కలకు సోకిన చర్మవ్యాధి నివారణకు ఐవర్‌మెక్టిన్ అనే లిక్విడ్, మాత్రలను ఏదైన మాంసంలో కలిపి కుక్కలకు వారం రోజుల పాటు క్రమం తప్పకుండా అందజేసినట్లైయితే వ్యాధి ప్రభలకుండా కొంత వరకు అదుపు చేయవచ్చు.

కేంద్ర సర్కార్‌కు బుద్ధి చెప్పాలి

● సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భాస్కర్



సమావేశంలో మాట్లాడుతున్న భాస్కర్

మహబూబాబాద్ టౌన్, జనవరి28 : స్కీము వర్కర్లకు కనీస వేతనాలు ఇవ్వని బీజేపీ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ పిలుపునిచ్చారు. మహబూబాబాద్ పెరుమాండ్ల జగన్నాథం భవన్‌లో సీఐటీయూ అనుబంధ తెలంగాణ ఐకేపీ వీవోఏల ఉద్యోగుల సంఘం, అంగన్‌వాడీ యూనియన్ జిల్లా విస్తృతస్థాయి సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈసందర్భంగా హాజరైన ఆయన మాట్లాడుతూ అనేక త్యాగాలు, పోరాటాలతో సాధించుకున్న కార్మిక చట్టాలను బీజేపీ ప్రభుత్వం రద్దుచేసి నాలుగు లేబర్‌కోడ్‌లను తీసుకువచ్చి కార్మికులను కట్టుబానిసలుగా మారుస్తున్నారని విమర్శించారు. కార్మిక, రైతాంగ, ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న బీజేపీ ప్రభుత్వంపై సమిష్టితో పోరాడాలని చెప్పారు. ఫిబ్రవరి 16న జరిగే కార్మిక సమ్మె, గ్రామీణబంద్‌లో పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలన్నారు. సీఐటీయూ నేతలు కాసు మాధవి, ఆకుల రాజు, కుంట ఉపేందర్, వెలిశాల సుధాకర్, బి.సంపూర్ణ, సమ్మెట రాజమౌళి పాల్గొన్నారు.

లయన్స్ ఆధ్వర్యంలో అన్నదానం

కేసముద్రం, జనవరి 28 : కేసముద్రం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం క్లబ్ సభ్యుడు దాసరి అశోక్‌స్రవంతి సహకారంతో అన్నదానం నిర్వహించారు. క్లబ్ అధ్యక్షుడు బెజ్జం ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ దాతలసహకారంతో అన్నదానం నిర్వహిస్తున్నామని తెలిపారు. చార్టర్ ప్రెసిడెంట్ డాక్టర్ కె.చంద్రశేఖర్, పాస్ట్ జడ్‌సీ యర్నం శ్రీరాములు, శామకూరి నర్సయ్య, చింతా కరుణాకర్, మారం సమ్మిరెడ్డి, కొడకండ్ల ప్రభాకర్, మడిపెద్ది వెంకటేష్ పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి సాయం

నెల్లికుదురు, జనవరి 28 : మండలంలోని రామన్నగూడెం గ్రామంలో విరపురం యాకయ్య అనారోగ్యంతో మృతి చెందడంతో ఆయన కుటుంబసభ్యులకు ఉపసర్పంచ్ కాసం లక్ష్మారెడ్డి ఆర్థిక సహాయం అందజేశాడు. రూ.5 వేలు 50 కిలోల బియ్యం అందజేశాడు. కార్యక్రమంలో ఎంపీటీసీ పెరమాండ్ల సుమలత, మురళీ, కనకం శ్రీను, సుంకరి శ్రీను, బాబురావు, చీకటి జగదీష్, రంగయ్య పాల్గొన్నారు.

మతోన్మాదానికి వ్యతిరేకంగా ఉద్యమించాలి

● పీఎన్ఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకన్న


పీఎన్ఎం సమావేశంలో మాట్లాడుతున్న వెంకన్న

మహబూబాబాద్ టౌన్, జనవరి 28 : దేశంలో పెరుగుతున్న మతోన్మాదానికి వ్యతిరేకంగా ప్రజాకళాకారులు ఉద్యమించాలని ప్రజానాట్యమండలి (పీఎన్ఎం) రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేర్పుల వెంకన్న పిలుపునిచ్చారు. మహబూబాబాద్ పెరుమాండ్ల జగన్నాథం భవన్‌లో ఆదివారం పీఎన్ఎం జిల్లా నాలుగవ మహాసభలను నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యవక్తగా హాజరైన ఆయన మాట్లాడుతూ దేశంలో అధికారంలోఉన్న బీజేపీ మతాల మధ్యచిచ్చు పెడుతూ ప్రజలను విడదీస్తున్నారని ఆరోపించారు. బలహీన వర్గాలపై దాడులు చేస్తూ ప్రజలను భయాభ్రాంతులకు గురి చేస్తున్నారని విమర్శించారు. ప్రజా కళాకారులు ప్రజల కష్టాలను, కన్నీళ్లను కళారూపంలో ప్రదర్శిస్తూ సమాజంలో చైతన్యం తీసుకురావాలని సూచించారు.50 సంవత్సరాలు నిండిన కళాకారులకు నెలకు రూ.10 వేల పెన్షన్ ఇవ్వాలన్నారు. అదే విధంగా ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో ప్రాధాన్యత కల్పించాలని కోరారు. జిల్లా నిర్మాణ బాధ్యులు, సీపీఎం మునిసిపల్ ఫ్లోర్‌లీడర్ సూర్నపు సోమయ్య, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజు, సంఘం జిల్లా కన్వీనర్ నక్క సైదులు, జంగం ఉప్పలయ్య, నక్క ఉప్పలయ్య, కడారి విజయ, జ్యోతి, రామయ్య, కడియం సత్యం, మహ్మద్ యాకూబ్, నరేందర్ పాల్గొన్నారు.


కోదండరామ్‌కు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలుపుతున్న టీజేఎస్ నేతల

ఎమ్మెల్సీ కోదండరామ్‌ను కలిసిన టీజేఎస్ నేతలు

మహబూబాబాద్ టౌన్, జనవరి 28 : హైదరాబాద్‌లో తెలంగాణ ఉద్యమ సేనాని, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్‌ను ఆదివారం తెలంగాణ జన సమితి మహబూబాబాద్ జిల్లా నేతలు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఇటీవల గవర్నర్ కోటలో ఎమ్మెల్సీగా నియామకమైన కోదండరాంను కలిసి పుష్పగుచ్చం అందించి శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ ఉద్యమ రథసారథి కోదండరామ్‌కు ఎమ్మెల్సీగా అవకాశం కల్పించడం యావత్ తెలంగాణ ప్రజలకు దక్కిన గౌరవమని టీజేఎస్ జిల్లా అధ్యక్షుడు డోలి సత్యనారాయణ అన్నారు. ఫిబ్రవరి రెండోవారంలో ఆత్మీయ సన్మానసభను నిర్వహిస్తామని అందుకు ముఖ్య అతిథిగా హాజరు కావాలని కోదండరాంకు విజ్ఞప్తి చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో పిల్లి సుధాకర్, ఆరుద్ర పరమాత్మాచారి పాల్గొన్నారు.

దండోరా సదస్సును జయప్రదం చేయండి

● ఎమ్మార్పీఎస్-టీఎస్ రాష్ట్ర కార్యదర్శి ఎల్లయ్య

నెహ్రూసెంటర్, జనవరి28 : హైదరాబాద్‌లో సోమవారం జరిగే దండోరా రాష్ట్ర సదస్సుకు దళితులు భారీగా తరలివచ్చి దండోరా సదస్సును జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్-టీఎస్ రాష్ట్ర కార్యదర్శి కొండ్ర ఎల్లయ్య పిలుపునిచ్చారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో జగ్జీవన్‌రాం, కేటీఆర్ కాలనీల్లో ఆదివారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్గీకరణ కోసం మాదిగలు దశాబ్దాలుగా పోరాడుతున్నారన్నారు. కేంద్రప్రభుత్వం ఎన్ని కల ముందు హామీలు ఇచ్చి నేటికి ఎస్సీ వర్గీకరణ చేయకుండా దళితులను మోసం చేసిందన్నారు. హామీలు ఇచ్చి పది సంవత్సరాలు దాటుతున్నప్పటికి కేవలం కమిటీ వేయడానికే పరిమితమయిందన్నారు. ఇప్పటికైనా ఎస్సీ వర్గీకరణ చేసి మాదిగలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బాలరాజు, పులి శ్రీను, సందీప్, సమ్మయ్య, సీహెచ్.రాధ, కుక్కల సుధ, ఎలేందర్, రమ, గుండ్ల పద్మ, భాను, విశ్వనాథం పాల్గొన్నారు.

మహిళ సాధికారతతోనే సమాజాభివృద్ధి

● జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి శంతన్

మహబూబాబాద్ టౌన్, జనవరి 28 : మహిళా సాధికారత తోనే సమాజాభివృద్ధి జరుగుతుందని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి శంతన్‌రామరాజు అన్నారు. మహబూబాబాద్ పట్టణంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం పలు సేవా కార్యక్రమాలను నిర్వహించారు. జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో నవజాత శిశువులకు నూతన దుస్తులు, గర్భిణీలకు పండ్లు పంపిణీ చేశారు. అనంతరం 23వ వార్డుపరిధిలో మహిళలకు కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. తర్వాత పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలని పిలుపునిచ్చారు. జీవితంలో ఎవరూ ఏ పనిచేసినా.. అది ఇతరులకు ఉపయోగపడేలా ఉండాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆస్పత్రి సివిల్ సర్జన్ మాలోతు రవీందర్, మేనకశంతన్, నారాయణసింగ్, సిరిపురం వీరన్న, పింద్రాల రాందాసు, సాగర్, శ్రీమాన్, శ్రీహరి, సత్యం, లాలయ్య, ఖాజా, తిరుపతిరెడ్డి, రాము పాల్గొన్నారు.

మున్నూరుకాపు సంఘం అభివృద్ధికి తోడ్పడాలి

● సంఘం రాష్ట్ర కార్యదర్శి చందా గోపి


సమావేశంలో మాట్లాడుతున్న గోపి

కేసముద్రం, జనవరి 28 : మున్నూరుకాపు కులస్తులంతా కలిసికట్టుగా ఉండి సంఘం అభివృద్ధికి తోడ్పాటునందించాలని మున్నూరుకాపు సంఘం రాష్ట్ర కార్యదర్శి చందా గోపి అన్నారు. కేసముద్రం మండలం అమినాపురంలోని ఎంకే కన్వెన్షన్ హాల్‌లో ఆదివారం సంక్షేమ సంఘం 21వ వార్షిక సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలోనే సంఘం ఆధ్వర్యంలో నిర్మిస్తున్న పెద్ద కన్వెన్షన్ హాల్ ఇదేనని తెలిపారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు నీలం శ్రీనివాస్, గౌరవ అధ్యక్షుడు వద్దిరాజు దేవేందర్, కముటం స్వామి, సింగంశెట్టి యాకాంతం, రావుల మురళి, దామరకొండ ప్రవీణ్‌కుమార్, ముత్యాల శివకుమార్, గనె యాదగిరి, సుందర్ వెంకన్న పాల్గొన్నారు.


ముల్కలపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్ 2009-10 టెన్త్‌బ్యాచ్‌కు చెందిన పూర్వవిద్యార్థులు


చెర్లపాలెం ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం

తొర్రూరు రూరల్, జనవరి 28 : మండలంలోని చెర్లపాలెం ఉన్నత పాఠశాల 2001-02 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం చెర్లపాలెం ఉన్నత పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనం అయ్యారు. 22ఏళ్ల తరువాత చదువులమ్మ ఒడిలో కలిసి విద్యా బోధనలు చేసిన ఉపాధ్యాయులతో పాఠశాలలో జరిగిన మధురమైన జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ ఆద్యంతం సంతోషంగా గడిపారు. అనంతరం గురువులను శాలువాలు, మెమెంటోలతో సన్మానించారు. చదువుకున్న పాఠశాల అభివృద్ధి కోసం, ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న మిత్రులకు ఆర్థికసాయం చేశారు.

ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం.బుచ్చయ్య ఉపాధ్యాయులు జినుక మోహన్ రెడ్డి, తండా ప్రభాకర్, కేశవ రెడ్డి, బంధు నారాయణ, కిషన్ నాయక్, శ్యాంసుందర్, సుభాస్, శ్రీనివాస్ రెడ్డి, పూర్వ విద్యార్థులు డి.నాగయ్య యాకయ్య, ఎనమాల శ్రీనివాస్, యాకూబ్‌పాషా, ధనుంజయ, మమత, రాంబాబు పాల్గొన్నారు.

● డోర్నకల్ : మండలంలోని ముల్కలపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్ 2009-10బ్యాచ్ కు చెందిన పూర్వవిద్యార్థుల సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. కుటుంబసభ్యుల వివరాలు, యోగక్షేమాలు తెలుసుకున్నారు. అనంతరం పూర్వ ప్రస్తుత ఉపాధ్యాయులను కలిసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం రుక్మాంగదరావు, పాఠశాల సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'తాగునీటిని అందించేందుకు ప్లాంట్ ఏర్పాటు'


రెడ్యాలలో వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న వెన్నం విజయ్‌కాంత్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి

మహబూబాబాద్ రూరల్, జనవరి 28 : రెడ్యాలలో ప్రజలకు సురక్షితమైన తాగునీటిని అందించేందుకోసం గ్రామంలో వాటర్‌ప్లాంట్ ఏర్పాటు చేసినట్లు ఎన్నారై వెన్నం విజయ్‌కాంత్‌రెడ్డి- శిల్పారెడ్డి దంపతులు, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గ్రామ సర్పంచ్ వెన్నం శ్రీకాంత్‌రెడ్డి-బిందురెడ్డి దంపతులు ఆదివారం వాటర్‌ప్లాంట్‌నుప్రారంభిం చారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ గ్రామప్రజలకు సురక్షితమైన తాగునీటిని అందించేందుకు తమతల్లి వెన్నం సరోజనాదేవి జ్ఞాపకార్థం రూ.10 లక్షలు వెచ్చించి ప్లాంట్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కుటుంబ సభ్యులు శ్రీలేఖ-భాస్కర్‌రెడ్డి, మా అసోసియేషన్ అధ్యక్షుడు బొద్దుపల్లి ఉపేందర్, చాంద్‌పాష, మాధవపెద్ది అమరేందర్‌రెడ్డి, నర్సింగ్ శ్రీనివాస్ యాదవ్, మల్లయ్య, లక్ష్మయ్య, సురేందర్‌రెడ్డి, రాజవర్ధన్‌రెడ్డి, కార్తీక్‌గౌడ్, మధు సూదన్‌రెడ్డి, సూరయ్య, వెంకట్రాం, నర్సింహారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, వీరారెడ్డి, రవి, కిరణ్, మంగీలాల్ పాల్గొన్నారు.

'పేదల గుడిసెలకు పట్టాలు ఇవ్వాలి'

కురవి, జనవరి28 : ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకుని జీవనం సాగిస్తున్న పేదల స్థలాలను క్రమబద్ధీకరించి, ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కురవి శివారులో గుడిసెవాసుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వ తొమ్మిదేళ్ల పాలనలో పేదలకు ఇళ్లు, ఇండ్ల స్థలాలు ఇవ్వలేదని ఆరోపించారు. సీపీఐ మండల కార్యదర్శి కర్నం రాజన్న, కన్నె వెంకన్న, బుర్ర సమ్మయ్య, తురక రమేష్, బూరుగుల కృష్ణ, వీరన్న పాల్గొన్నారు.

నేడు పెండింగ్ స్కాలర్‌షిప్‌ల కోసం కలెక్టరేట్

కురవి, జనవరి28 : మెస్, కాస్మోటిక్ చార్జీలు పెంచాలని, పెండింగ్‌లో ఉన్న డైట్ బిల్లులు తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో చేపట్టిన ఛలో కలెక్టరేట్‌ను విజయవంతం చేయాలని మరిపెడ డివిజన్ కార్యదర్శి గంధసిరి జ్యోతిబసు కోరారు. ఈ మేరకు కురవిలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణలో ప్రస్తుత విద్యాసంవత్సరంతో కలిపి రూ.7800 కోట్లు పెండింగ్ స్కాలర్‌షిప్‌లు, రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఉన్నాయని, తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఛలో కలెక్టరేట్‌కు విద్యార్థులు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు వీరేందర్, మహేష్, నవీన్, ప్రవీణ్, వినోద్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

కొత్తగూడ, జనవరి 28 : మండలంలోని కిష్టాపురంలో అగ్నిప్రమాదంలో ఇళ్లు కాలిపోయిన బంగారి సమ్మయ్య కుటుంబాన్ని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీశిశు సంక్షేమ శాఖమంత్రి దనసరి సీతక్క కోడలు కుంజ కుసుమాంజలి ఆదివారం పరామర్శించారు. ఇంటి నిర్మాణంకు సిమెంట్, ఇసుక, రేకులు, సామగ్రిని అందిస్తామని కుసుమాంజలి హామీ ఇచ్చారు. గృహలక్ష్మి పథకంలో ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయిస్తామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వజ్జ సారయ్య, సర్పంచ్‌లు మల్లెల రణధీర్, వజ్జ వెంకటలక్ష్మి సురేందర్, జిల్లా నాయకుడు లావణ్య వెంకన్న, ఎంపీటీసీ హలావత్ సాలూకీ సురేష్, నాయకులు గట్టయ్య, ప్రశాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

● బంగారి సమ్మయ్య కుటుంబానికి కోమట్లగూడెంలోని కోదండరామ సేవ కమిటీ, నర్సంపేట రోటరీ క్లబ్, శుభమస్తు షాపింగ్‌మాల్ ఆధ్వర్యంలో రూ.40 వేలు ఆర్థిక సహయం చేశారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధికారి ఇరుకు కోటేశ్వరరావు, ప్రెసిడెంట్ బాదం రంజిత్, కోదండరామసేవ కమిటీ చైర్మన్ సైప సురేష్, వైస్ చైర్మన్ ప్రతాపని శ్రీకాంత్, శుభమస్తు షాపింగ్ నిర్వహకుడు శ్రీరాంకిరణ్, సుమన్, మాలే కనకయ్య పబ్బ శ్రీనివాస్, మాలే రాజేష్, గండు నవీన్ పాల్గొన్నారు.

అంగరంగవైభవంగా శివపార్వతుల కల్యాణం

● ముగిసిన దేవతామూర్తుల కల్యాణోత్సవాలు


శివపార్వతుల కల్యాణోత్సవంలో పూజలు చేస్తున్న పర్కాల శ్రీనివాస్‌రెడ్డి దంపతులు, హాజరైన భక్తులు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జనవరి28 : జిల్లా కేంద్రంలోని పీఎస్ఆర్ కన్వెన్షన్‌హాల్లో శ్రీసత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో శివపార్వతుల కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. శ్రీసత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో మూడ్రోజులపాటు లోకకల్యాణార్థం చేపట్టిన దేవతామూర్తుల కల్యాణోత్సవాలు ముగిసాయి. చివరి రోజు ఆదివారం వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ శివపార్వతుల కల్యాణాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం ప్రభాత సేవ, వేద పారాయణం, లింగార్చన, శ్రీపార్వతిపరమేశ్వరుల కల్యాణం నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం నోరి నారాయణమూర్తి ఉపన్యాసం, హరికథ, సంగీత కచేరీతో మూడ్రోజుల కార్యక్రమాలు విజయవంతంగా ముగిశాయి. మునిసిపల్ చైర్మన్ పాల్వాయి రాంమోహన్‌రెడ్డి, కేసముద్రం మార్కెట్ మాజీ చైర్మన్ పర్కాల శ్రీనివాస్‌రెడ్డి, శ్రీసత్యసాయి సేవా సమితి బాధ్యులు సామల శ్రీనివాస్, వందన కమల్‌కుమార్, మాధవరపు ప్రదీప్,చంద్రప్రకాష్, రవికుమార్, విద్యాసాగర్, నాగేశ్వర్‌రావు, ఫణికుమార్, ప్రమోద్, భాస్కర్, నారాయణరావు, సుజాత, సాయి, లత, అరుణశ్రీ పాల్గొన్నారు.


జూనియర్ ఫారెస్టు ఆఫీసర్స్ అసోషియేషన్ జిల్లా యూనిట్ సభ్యులు

జూనియర్ ఫారెస్టు ఆఫీసర్స్ అసోసియేషన్ కమిటీ ఎన్నిక

గూడూరు, జనవరి 28 : జిల్లా జూనియర్ ఫారెస్టు ఆఫీసర్స్ అసోసియేషన్ నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సాంబు, ఉపాధ్యక్షుడిగా విష్ణువర్ధన్, ప్రధాన కార్యదర్శిగా విక్రమ్‌కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా రమేష్, సంయుక్త కార్యదర్శిగా కవితారెడ్డి, కోశాధికారిగా సత్యంలను ఎన్నుకున్నారు. గూడూరులోని ఆర్యవైశ్య ఫంక్షన్ హాల్ నందు జరిగిన ఎన్నికల కార్యక్రమానికి ఎన్నికల పరిశీలకుడిగా ఆ సంఘం రాష్ట్ర కమిటీ బాధ్యులు జవహర్, చక్రవర్తి, శ్రీనివాస్, సమ్మయ్యలు వ్యవ హరించారు.

మల్లన్న సన్నిధిలో భక్తుల కిటకిట

ఐనవోలు, జనవరి 28 : ఐనవోలు మల్లికార్జునస్వామి వారాంతపు జాతరలో భాగంగా 2వ ఆదివారం భక్తులు వివిధ జిల్లాల నుంచి సుమారు లక్షమంది తరలివచ్చారు. శనివారం సాయంత్రం నుంచే భక్తులు ఆలయ ప్రాంగణంలో విడిదిచేశారు. స్వామి వారికి ఉదయం మేలుకొలుపు తర్వాత శైవాగమ పద్ధతిలో అర్చకులు విశేష అభిషేకాలు, కల్యాణం నిర్వహించి రుద్రాభిషేకాలు జరిపారు.భక్తులు ఆలయ ప్రాంగణంలో నజర్, చెలక పట్నాలు వేసి బోనం వండి స్వామి వారికి నైవేద్యం సమర్పించిమొక్కులు తీర్చుకున్నారు. ఒగ్గుపూజారులు నజర్, చిల్క పట్నాల వద్ద పూర్వీకులను స్తుతించారు. ఆపదల నుంచి గట్టెకించి కోర్కెలు తీర్చమని మల్లన్నను భక్తులు వేడుకున్నారు. మొక్కుల్లో భాగంగా స్వామి అమ్మవార్లకు భక్తులు ఒడిబియ్యం, వస్త్రాలు, ముత్తైదు సామగ్రిని ముట్టచెప్పారు. రథం (శావ)లో ఉత్సవ విగ్రహాలను పెట్టి ఆలయం చుట్టు భక్తులు లాగుతూ ప్రదక్షిణలు చేశారు. ఈవో అద్దంకి నాగేశ్వర్‌రావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

గుడిసె వాసులకు పట్టాలివ్వాలి

▸▸ సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడా వెంకట్‌రెడ్డి

కాకతీయఖని, జనవరి 28: ప్రభుత్వ స్థలాల్లో గుడిసెలు వేసుకున్న పేదలకు పట్టాలు జారీ చేయాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడా వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు. భూపాలపల్లి పట్టణంలోని సర్వ నంబరు 280లో పేదలు గుడిసెలు వేసుకుని ఆదివారం నాటికి ఏడాది పూర్తయిన సందర్భంగా కాలనీని సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ప్రభుత్వం పేదలకు ఇచ్చిన అనేక హామీలను విస్మరించిందని విమర్శించారు. సర్వేనంబర్ 280 భూమిలో గుడిసెలు వేసుకున్న వారికి పట్టాలు జారీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు తీసుకెళ్లి పరి ష్కరించాలన్నారు. సీపీఐ రాష్ట్ర కార్య దర్శివర్గ సభ్యుడు తక్కళ్లపెల్లి శ్రీనివాసరావు, భూపాలపల్లి జిల్లా కార్యదర్శి రాజ్‌కుమార్, నాయకులు అశోక్, ప్రవీణ్, సతీష్ పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

- తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు మల్లెల రాము


కొత్తగూడలో మాట్లాడుతున్న మల్లెల రాము

కొత్తగూడ, జనవరి 28 : ఆదివాసీ యువత రాజ్యాంగంలో ఆదివాసీలకు కల్పించిన హక్కులు, చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు మల్లెల రాము పిలుపునిచ్చారు. కొత్తగూడలో ఆదివారం తుడుందెబ్బ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ ఆదివాసీలు సంస్కృతి, సాంప్రదాయాలను కాపాడుకోవాలన్నారు. విద్య, ఉపాధిరంగాల్లో, రాజకీయాల్లో రాణించాలన్నారు. సమావేశంలో మండల అధ్యక్షుడు పూనెం సందీప్, మాజీ తుడుందెబ్బ అధ్యక్షుడు బండ సమ్మయ్య, మండల ప్రధాన కార్యదర్శి మల్లెల సారయ్య, ఉపాధ్యక్షుడు సతీష్, వెంకన్న, నాగేష్, సుధాకర్, సందీప్, రంజిత్, మణిశర్మ, క్రాంతి, మనోజ్, నరేష్, సుధీర్, పవన్ పాల్గొన్నారు.

ఐకేపీ, వీవోఏల సంఘం జిల్లా నూతన కమిటీ


మౌనిక ప్రధాన కార్యదర్శి
నీలం కృష్ణవేణి అధ్యక్షురాలు

మహబూబాబాద్ రూరల్, జనవరి 28 : సీఐటీయూ అనుబంధ తెలంగాణ ఐకేపీ వీవోఏల ఉద్యోగుల సంఘం జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మహబూబాబాద్‌లో ఆదివారం నిర్వహించిన సంఘ సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లాఅధ్యక్షురాలిగా నీలం కృష్ణవేణి, ఉపాధ్యక్షులుగా కందుల శోభారాణి, గుగులోతు హన్మంతు, శ్రీలత, ప్రధాన కార్యదర్శిగా చింతా మౌనిక, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా వెలిశాల సుధాకర్, సహాయ కార్యదర్శులుగా చిల్ల నిరంజన్, బోళ్ల ఉమారాణి, కోశాధికారిగా ఆకుల వసంతలు ఎన్నికయ్యారు. తమ ఎన్నికకు సహకరించిన అన్నిమండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులకు నూతన కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు కృష్ణవేణి, మౌనిక కృతజ్ఞతలు తెలిపారు.


వీహెచ్‌పీ మండల కమిటీ ఎన్నిక

కేసముద్రం, జనవరి 28 : విశ్వహిందూ పరిషత్ కేసముద్రం మండలం కమిటీని స్థానిక శ్రీరామ మందిరం ఆవరణలో ఆదివారం వీహెచ్‌పీ జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణమోహన్, ఆర్ఎస్ఎస్ మానుకోట జిల్లా కార్యవాహ పింగిళి శ్రీనివాస్ సమక్షంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బాణాల నాగరాజు, ప్రధాన కార్యదర్శిగా తాడూరి ఉమేష్ కోశాధికారిగా అల్లం నిరంజన్, సహాయ కార్యదర్శులుగా శ్రీరాంసంతోష్, బానోత్ మోహన్, ముక్క సందీప్, గుగులోత్ వీరన్న, బాల్‌మోహన్‌తోపాటు మరికొందరిని ఎన్నుకున్నారు.

బాధిత కుటుంబానికి సాయం

గంగారం, జనవరి 28 : ఇటీవల క్రిష్టారంలో జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన బంగారు సమ్మయ్య కుటుంబానికి కోమట్లగూడెం కోదండరామ సేవా కమిటీ చైర్మన్ సైపా సురేష్ ఆదివారం రూ.40వేల ఆర్థిక సహయంను అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు మానవసేవే మాదవసేవ అంటూ కోదండరామాలయం పలు సేవా కార్యాక్రమాలు దిగ్విజయంగా నిర్వహిస్తుందన్నారు. మండలంలో ఆపద వచ్చిన ప్రతీ ఒక్కరిని ఆదుకుంటున్నామన్నారు. మండలంలో యువత సహకారంతో పలు సంఘ సేవా కార్యక్రమాలు కూడా నిర్వహిస్తున్నామన్నారు. ప్రతాపని శ్రీకాంత్, పల్లే సురేష్, గుండు నవీన్, రోటరీ క్లబ్ నుంచి బాదం రంజిత్, నర్సింహారావు, ఇరుకు కోటేశ్వరావు, వజ్జా సురేందర్, పబ్బా శ్రీనివాస్, అల్లాడి బాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

కాంపెల్లి సొసైటీకి యూరియా బస్తాలు


యూరియా బస్తాలను దిగుమతి చేయిస్తున్న ఏవో మంజుఖాన్

సీరోలు, జనవరి28 : మండలంలోని కాంపెల్లి సొసైటీకి ఆదివారం యూరియా బస్తాలు వచ్చినట్లు మండల వ్యవసాయాధికారి మంజుఖాన్ తెలిపారు. రబీ సీజన్ ప్రారంభమవుతున్నందునరైతుల అవసరార్థం సొసైటీకి 445 యూరియా బస్తాలు వచ్చాయని, ఈ సదావకాశాన్ని సీరోలు, కాంపెల్లి, ఉప్పరిగూడెం, తాళ్లసంకీస, కొత్తూరు (సి), కందికొండ, గ్రామాల రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

టీఎస్‌యూటీఎఫ్ నూతన కార్యవర్గం

కురవి, జనవరి 28 : మండలం టీఎస్‌యూటీఎఫ్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్.యాకూబ్ తెలిపారు. మండల అధ్యక్షుడిగా ఎం.ప్రవీణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా కె.రాజశేఖర్, ఉపాధ్యక్షులుగా కె.ప్రసాద్, ఎస్.శైలజ, కోశాధికారిగా పి.జయ, కార్యదర్శులుగా యా.సురేష్, సీహెచ్.ప్రదీప్, బి.రవీందర్, పి.మాధవి,సీహెచ్.రామకృష్ణ, ఆర్.సురేష్, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా బి.బాబు, సభ్యులుగా వీరభద్రం, ఎస్కె అస్మత్‌పాషా, అకాడమిక్ కమిటీ కన్వీనర్‌గా ఎం.శ్రీధర్, కె.వీరన్న, జీవోల కమిటీ కన్వీనర్‌గా పి.లక్ష్మయ్య, టి.మల్లయ్య, మహిళ కమిటీ కన్వీనర్‌గా బి.సంధ్యారాణిని ఎన్నుకున్నారు.